క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: విద్యుత్ సంబంధిత మరమ్మతుల కారణంగా కరెంట్ నిలిపివేస్తున్నట్లు కొండాపూర్ ఏఈ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పీజేఆర్‌నగర్, రిలయన్స్ సెంట్రో ఎదురుగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

18న బాల బృందావనం

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్ ప్రాంగణంలో ఆదివారం బాల బృందావనం కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. పిల్లల కోసం ప్రత్యేకంగా సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ×బెనిఫిట్స్ ఆఫ్ రాజయోగ॥ పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తారు. ముఖ్యంగా యోగాసనాలపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040-23001234లో సంప్రదించవచ్చు.

పట్టణ ప్రగతికి తరలిన జీహెచ్ఎంసీ అధికారులు



గచ్చిబౌలి: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మాదాపూర్‌లోని శిల్పకళా వేదికలో శుక్రవారం రాష్ట్రస్థాయి పట్టణ ప్రగతి కార్యక్రమం నిర్వహించారు. శేరిలింగంపల్లి వెస్ట్ జోన్ నుంచి జోనల్ కమిషనర్ శంకరయ్య, డీసీ వెంకన్న బస్సులో శిల్పకళా వేదికకు తరలివెళ్లారు. చందానగర్ సర్కిల్ నుంచి డీసీ సుదాంష్ ఆధ్వర్యంలో అధికారులు వెళ్లారు.

ఫిట్‌నెస్ లేని బస్సులు సీజ్

పటాన్‌చెరు టౌన్: విద్యాసంస్థలు ప్రారంభమైన నేపథ్యంలో బస్సుల ఫిట్‌నెస్‌ను పరిశీలించినట్లు పటాన్‌చెరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) రాజా మహ్మద్ తెలిపారు. శుక్రవారం పటాన్‌చెరు టోల్‌గేట్ సమీపంలో రవాణాశాఖ ఎంవీఐ లావణ్యతో కలసి స్కూల్ బస్సుల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పటాన్‌చెరు పరిధిలో మూడు విద్యాసంస్థలకు చెందిన బస్సులకు ఫిట్‌నెస్ సరిగా లేని కారణంగా సీజ్ చేసినట్లు తెలిపారు.

డిజైర్ డిజైనర్స్ ఎగ్జిబిషన్ ప్రారంభం



మాదాపూర్: మాదాపూర్‌లోని ఎన్‌కన్వెన్షన్‌లో డిజైర్ డిజైనర్స్ ఎగ్జిబిషన్‌ను నటి శ్రీలేఖ శుక్రవారం ప్రారంభించారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఎగ్జిబిషన్‌లో పలువురు డిజైనర్లు రూపొందించిన వస్త్రాభరణాలను అందుబాటులో ఉంచారు.



గౌలిదొడ్డిలో వార్డు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి



హఫీజ్‌పేట్ డివిజన్‌లో.. కార్పొరేటర్లు జగదీశ్వర్‌గౌడ్, పూజితాగౌడ్, అధికారులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

వార్డు పాలన .. సమస్యలు సత్వర పరిష్కారం

- శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ
- నియోజకవర్గ వ్యాప్తంగా వార్డు కార్యాలయాలు ప్రారంభం

శేరిలింగంపల్లి జోన్ బృందం: జీహెచ్‌ఎంసీలో పరిపాలనా వికేంద్రీకరణ కోసం వార్డు స్థాయి పాలనకు శ్రీకారం చుట్టడం జరిగిందని ప్రభుత్వవిప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. శుక్రవారం గచ్చిబౌలి డివిజన్ గౌలిదొడ్డిలో నూతన వార్డు కార్యాలయాన్ని ఆయన గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డితో జెడ్సీ శంకరయ్య, డీసీ వెంకన్నతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించాలనే లక్ష్యంగా వార్డు స్థాయి పరిపాలనను ప్రవేశ పెట్టారన్నారు .సీఎం కేసీఆర్, మంత్రి కేటీరామారావు ఆలోచనలకు అనుగుణంగా ఈ వినూత్న పాలనా విధానాన్ని అమలులోకి తీసుకురావడం జరిగిందన్నారు. నగరంలోని 150 డివిజన్లలో వార్డు కార్యాలయాలు ప్రారంభమయ్యాయన్నారు. ప్రతివార్డుకు వార్డు పరిపాలనా అధికారితో పాటు మొత్తం 10 మంది అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. శనివారం నుంచి అధికార యంత్రాంగం అందుబాటులో ఉంటారని, ప్రజలు బస్తీ, కాలనీ సమస్యలు అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ అధికారులు, వార్డుస్థాయి అధికారులు, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ల ప్రతినిధులు, వార్డు, ఏరియా కమిటీ మాజీ సభ్యులు, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యాలయాలను ప్రారంభించిన కార్పొరేటర్లు

గచ్చిబౌలి డివిజన్‌లో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, కొండాపూర్ డివిజన్‌లో కార్పొరేటర్ షేక్ హమీద్‌పటేల్, శేరిలింగంపల్లిలో కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్, హఫీజ్‌పేట్‌లో కార్పొరేటర్ పూజితాగౌడ్, చందానగర్‌లో కార్పొరేటర్ మంజులారఘునాథ్‌రెడ్డి, మియాపూర్‌లో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, మాదాపూర్‌లో కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్ ప్రారంభించారు. వార్డు స్థాయి అధికార యంత్రాంగం బాధ్యతలు చేపట్టారు. ఆయా ప్రాంతాలలో వార్డు కార్యాలయాల ప్రారంభోత్సవానికి కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, రాజకీయ నాయకులు, అధికార యంత్రాంగం, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల చెంతకే పౌరసేవలు

పటాన్‌చెరు: ప్రజల చెంతకే పౌర సేవలు అందించాలన్న సమున్నత లక్ష్యంతో ముఖ్యమంత్రి కేసీఆర్ దేశంలోనే మొట్టమొదటిసారిగా వార్డు కార్యాలయాల వ్యవస్థను ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన వార్డు కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఉత్తమ పారిశుద్ధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ బాలయ్య, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.



చందానగర్ డివిజన్‌లో.. కార్పొరేటర్ మంజులారఘునాథ్‌రెడ్డి



కొండాపూర్ డివిజన్‌లో.. కార్పొరేటర్ షేక్ హమీద్‌పటేల్



శేరిలింగంపల్లిలో.. జోనల్ కమిషనర్ శంకరయ్య, కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ తదితరులు



మియాపూర్‌లో.. కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తదితరులు

ప్రజలను మభ్యపెడుతున్న ప్రభుత్వం



పాదయాత్రలో గిరిజన మహిళలతో నాయకుడు రవికుమార్ యాదవ్

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్‌యాదవ్

గచ్చిబౌలి: ఎప్పుడు ఎన్నికలు నిర్వహించినా తెలంగాణ రాష్ట్రంలో బీజేపీదే అధికారమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.రవికుమార్ యాదవ్ జోస్యం చెప్పారు. శుక్రవారం మాదాపూర్‌లోని సాయినగర్‌లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు తీర్చలేక ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. ఖానామెట్ సర్వే నెంబర్ 41, 11/7లో కబ్జాదారులకు బీఆర్ఎస్ నాయకులు అండగా నిలుస్తున్నారని, స్మశాన వాటికనూ వదలడం లేదని ఆయన ఈ సందర్భంగా విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ శేరిలింగంపల్లి నియోజకవర్గం కన్వీనర్ రాఘవేంద్రరావు, రాధాకృష్ణ యాదవ్, భిక్షపతి ముదిరాజ్, గోపాల్, మధుయాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, మాధవచారీ, భారతి, పార్వతి, నాగులు, సురేష్ పాల్గొన్నారు.

స్టాలిన్‌నగర్‌లో..

మియాపూర్: రాష్ట్ర ప్రభుత్వం 9 ఏళ్ల పాలనలో ప్రజలకు చేసేంది ఏమీ లేదని ఎక్కడి సమస్యలు అక్కడే దర్శనమిస్తున్నాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్‌యావ్ ఆరోపించారు. మియాపూర్‌లోని స్టాలిన్‌నగర్ కాలనీలో గడప గడపకు బీజేపీ పాదయాత్ర శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్‌యాదవ్ బీజేపీ నాయకులతో కలిసి కాలనీలో ఇంటింటికి తిరిగి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్టాలిన్‌నగర్‌లో మంచినీటి కోసం ఇక్కట్లు పడుతుంటే ప్రజాప్రతినిధులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ రాఘవేందర్‌రావు, నాగులుగౌడ్, లక్ష్మణ్, ముఖేష్, కాశీనాథ్, సునీల్, అభిషేక్, దుర్గేష్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నాం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: పట్టణ ప్రగతిలో పట్టణాలలో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా 15వ రోజు అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో నిర్వహించిన పట్టణ ప్రగతి కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డితో కలిసి హాజర్వై ర్యాలీని ప్రారంభించారు. అనంతరం వాణీనగర్‌లో నూతన బస్తీ దవాఖానాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన అమీన్‌పూర్ మున్సిపాలిటీలో రూ.కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. 250 పైగా కాలనీలతో విస్తరించిన మున్సిపాలిటీలో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. పచ్చదనం పెంపునకు మొక్కలను పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.



దంపతుల అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: దంపతులిద్దరూ అదృశ్యమయ్యారు. భానూర్-బీడీఎల్ ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి కథనం ప్రకారం..పటాన్‌చెరు మండలం నందిగామకు చెందిన సంధ్య వివాహం చేవెళ్ల మండలం కౌరికుంట్ల గ్రామానికి చెందిన సంతోష్‌తో జరిగింది. సంతోష్ సదాశివపేట ఎంఆర్‌ఎఫ్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. వారంరోజుల క్రితం సంధ్య తల్లిగారింటికి వచ్చింది. రెండురోజుల క్రితం బంధువుల శుభకార్యానికి సంతోష్ అత్తగారి ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో 15వ తేదీన ఉదయం డ్యూటీకి వెళ్లాడు. అదే రోజు సాయంత్రం నాలుగుగంటలకు సంధ్య భర్తతో కలిసి బైక్‌పై వెళ్లింది. సాయంత్రం ఆరుగంటలకు లక్ష్మి కూతురు, అల్లుడుకు ఫోన్ చేయగా ఇద్దరి ఫోన్లు స్విచ్‌ఆఫ్ వచ్చాయి. దీంతో తెలిసినా వారికి ఫోన్ చేసినా ఆచూకీ లభించలేదు. దీంతో లక్ష్మి ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

గచ్చిబౌలి: గుర్తు తెలియని వ్యక్తి (50) మృతదేహం లభ్యమైన సంఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ రాంభూపాల్ రెడ్డి తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రాయదుర్గంలోని వెల్స్‌ఫార్గో భవనం వెనుక మధురానగర్‌లోని రేణుక ఎల్లమ్మ ఆలయం వెనుక ఓ వ్యక్తి పడి ఉన్నాడని గురువారం మధ్యాహ్నం స్థానికులు ఫిర్యాదు చేశారు. పరిశీలించగా అనారోగ్యంతో మృతి చెంది ఉంటాడని, ఎలాంటి వివరాలు తెలియలేదని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే 9490617191 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని పోలీసులు సూచించారు.



పైప్‌లైన్ లీకేజీలతో గుంతలు పడ్డ రోడ్డు





మంజీరా పైప్‌లైన్ రోడ్డులో లీకేజీ

లీకేజీలు.. తవ్వకాలు

- రోడ్డుపై భారీ గుంతలు
- మంజీరా రోడ్డులో వాహనదారుల ఇబ్బందులు

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్ డివిజన్ పరిధి మంజీరా రోడ్డులోని ప్రధాన పైప్‌లైన్ లీకేజీలతో స్థానిక ప్రజలు, వాహనదారులు ఇబ్బందులుపడుతున్నారు. పైప్‌లైన్ లీకేజీల వల్ల తాగునీరు రోడ్డుపాలవుతోంది. నిత్యం లీకేజీలతో రోడ్డుపై భారీగా గుంతలు ఏర్పడ్డాయి. వీటి మీదుగా రాకపోకలు సాగించాల్సి రావడంతో అవస్థలపాలవుతున్నారు. దశాబ్దం క్రితం వేసిన మంచినీటి పైప్‌లైన్ కావడంతో ఆర్టీసీ కాలనీ నుంచి హఫీజ్‌పేట్ ఫ్లైఓవర్ వరకు నిత్యం ఎక్కడో ఒక చోట లీకేజీ ఏర్పడుతోంది. మరమ్మతుల వలన రోజుల తరబడి ఓవైపు రోడ్డు మూసి వేస్తున్నారు పైప్‌లైన్ బాగు చేసిన చోట పెద్ద గుంత ఏర్పడి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇక వారాంతపు సంత ఉన్న రోజు వాహనదారులు అటు వైపు రావాలంటే భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరుతున్నారు.



మరమ్మతుల కోసం రోడ్డుకు అడ్డుగా బారికేడ్లు ఏర్పాటు చేసిన దృశ్యం

- ఆర్టీసీ కాలనీ నుంచి హఫీజ్‌పేట్ ఫ్లైఓవర్ వరకు లీకేజీలతో రోడ్డుపై మంచినీరు ఏరులై పారుతుంది.
- జలమండలి సిబ్బంది మరమ్మతుల కోసం నిత్యం రోడ్డుపై తవ్వకాలు చేపడుతుండడంతో గుంతలు ఏర్పడుతున్నాయి.
- ఇక అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్ కోసం తవ్విన గుంతలతో మరింత ఇబ్బంది కలుగుతోందని స్థానికులు వాపోతున్నారు.
- లింగంపల్లి-హఫీజ్‌పేట్ ఫ్లై ఓవర్ వరకు ఉన్న మంజీరా పైప్‌లైన్‌ను స్థానంలో కొత్త పైప్‌లైన్ వేయాలని స్థానికులు కోరుతున్నారు.


నిత్యం తవ్వకాలు



మంజీరా పైప్‌లైన్ లీకేజీలతో ఇబ్బందులు పడుతుంటే మరో వైపు కొత్త పైప్‌లైన్ కోసం గుంతలు తవ్వడంతో ఇబ్బందిపడుతున్నాం. పైప్‌లైన్ మరమ్మతులను ప్రణాళికతో చేపట్టాలి. మరమ్మతుల పేరిట రోడ్డు మూసివేతతో ఇబ్బందులు పడుతున్నాం.

– శ్రీను, మైత్రీనగర్

రోడ్డు మూసివేతతో తీవ్ర ఇబ్బందులు



మంజీరా రోడ్డులో నిత్యం లీకేజీల పేరుతో మరమ్మతులు అంటూ రోడ్డు మూసివేసి పనులు చేపడుతున్నారు. ప్రతి రోజు ఎక్కడో ఒక చోట లీకేజీలతో రోడ్డుకు అడ్డుగా బారికేడ్లు పెట్టి మరమ్మతులు చేయడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఉన్నతాధికారులు శాశ్వత పరిష్కారం చేయాలి.

–శ్రీనివాస్, ఆర్టీసీ కాలనీ

25న వివాహ పరిచయ వేదిక

రామచంద్రాపురం(పటాన్‌చెరు): అఖిల బ్రాహ్మణ సమాజ అభివృద్ధి సంస్థ భెల్ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీన వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నామని అసోసియేషన్ అధ్యక్షుడు ఎంవీశాస్త్రి శుక్రవారం తెలిపారు. బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం ఉదయం 10 నుంచి సాయత్రం 4గంటల వరకు పరిచయ వేదిక కార్యక్రమం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు, వధూవరులు తమ పేర్లను అసోసియేషన్ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు.

కబ్జాలపై ఉద్యమిస్తాం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చెరువుల కబ్జాలపై పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని తెల్లాపూర్ నీటి సంఘం మాజీ చైర్మన్ వడ్డే నరసింహ, తెల్లాపూర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్ హెచ్చరించారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. చెలికుంట ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. ఈ విషయంపై హెచ్‌ఎండీఏ కమిషనర్‌కు లేఖ రాసినట్లు తెలిపారు.

అభివృద్ధే లక్ష్యంగా..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పట్టణ ప్రగతి దినోత్సవాన్ని తెల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ మల్లేపల్లి లలిత సోమిరెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ ప్రగతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ లలిత సోమిరెడ్డి మాట్లాడారు. అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుకు సాగుతున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, వైస్ చైర్మన్ రాములు గౌడ్ పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుడు అదృశ్యం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఓ భవన నిర్మాణ కార్మికుడు అదృశ్యమయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం..ఒడిశా రాష్ట్రానికి చెందిన ఓంకాశ్ యాదవ్ జీవనోపాధికి ఉస్మాన్‌నగర్‌కు మూడునెలల క్రితం వలస వచ్చాడు. స్థానికంగా ఓ భవన నిర్మాణ సంస్థలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. తోటి కూలీలతో కలసి లేబర్ క్యాంపులో నివాసం ఉంటున్నాడు. అతని కుటుంబ సభ్యులు ఒడిశాలో ఉంటున్నాడు. ఈ నెల 14వ తేదీ రాత్రి10గంటల సమయంలో ఇప్పుడే వస్తాను అని బయటకు వెళ్లిన ఓంకాశ్‌యాదవ్ తిరిగి రాలేదు.ఈ విషయం తెలుసుకున్న ఆయన అల్లుడు అదిత్య శుక్రవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కేసు నమోదు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని జ్యోతి థియేటర్‌లో ఆదిపురుష్ సినిమా ప్రదర్శన ఆలస్యం కావడంతో పలువురు ప్రేక్షకులు శుక్రవారం థియేటర్‌లోని కుర్చీలు, అద్దాలు ధ్వంసం చేశారు. ఈ ఘటనలో పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. థియేటర్ సిబ్బంది ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అందరికీ నెగెటివ్

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఏడుగురికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించారు. అందులో అందరికీ నెగెటివ్ వచ్చిందని నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. ఆర్టీపీసీఆర్ టెస్టులు 14 మందికి చేశారు.